క్లుప్తంగా

నిమ్మల పాడులో నేలపైనే చదువులు



తడకల పాకలో నేలపై కూర్చున్న గిరిజన విద్యార్థులు

సాలూరు రూరల్: మండలంలోని తోణాం పంచాయతీ నిమ్మలపాడు గ్రామంలో జీపీఎస్ పాఠశాలలో 9 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఈ పాఠశాల చిన్న పాకలో చుట్టూ తడకలతో కొనసాగుతోంది. ఎండైనా వానైనా విద్యార్థులు నేలపైనే కూర్చుని భరించాల్సిందే. గిరిజన శాఖ మంత్రి నియోజకవర్గంలోనే గిరిజన విద్యార్థుల దుస్థితి ఇది.

పెదపెంకిలో సుభాష్ చంద్ర బోస్ వర్ధంతి



నేతాజీ గ్రంథాలయం వద్ద సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసిన యువకులు

బలిజిపేట: మండలంలోని పెదపెంకి నేతాజీ గ్రంథాలయం వద్ద సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించి చంద్రబోస్ దేశభక్తిని పునస్మరణ చేసుకున్నారు. ఆయన పాల్గొన్న ఉద్యమాలు, ఆయన రచించిన గ్రంథాలు, ఆయనకు వచ్చిన బిరుదులను గురించి చర్చించారు. కార్యక్రమంలో కె.గౌరీనాథ్, ఎస్.భూషణరావు, పి.గౌరీశంకరరావు, కె.ఏసుబాబు, జి.శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

కిరాణా షాపుల్లో పోలీసుల దాడులు

సాలూరు రూరల్: మండలంలోని తోణాం గ్రామంలో కిరాణా షాపుల్లో అమ్ముతున్న శీతల పానీయాలు, బిస్కెట్ ప్యాకెట్లు కాలం చెల్లినవిగా గుర్తించిన ఆరుగురిపై కేసునమోదు చేసినట్లు రూరల్ ఎస్సై నరసింహమూర్తి తెలిపారు. ఈ నెల 16వ తేదీన తేజశ్విని అనే బాలిక కిరాణా షాపులో కూల్ డ్రింక్ తాగి అస్వస్థతకు గురి కావడంతో ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుకాణాలపై ఆదివారం దాడిచేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు దుకాణ దారులు వారణాసి మన్మథరావు, ఎస్.ఈశ్వరరావు, టి. వెంకటరమణ, వి.చినమల్లేశ్వరరావు, ఎం.సువర్ణలపై కేసు నమోదు చేశామన్నారు.

వర్క్ ఫ్రం హోం సర్వే వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసరావు

మక్కువ: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే వేగవంతం చేయాలని స్థానిక పంచాయతీ కార్య నిర్వహణాధికారి బెహరా శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు స్థానిక సచివాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. ఇటీవల కురుస్తున్న వర్షాల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సచివాలయానికి వచ్చే ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నీటమునిగిన వరిచేను పరిశీలన



మాట్లాడుతున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: మండలంలో కురుస్తున్న వర్షాల కారణంగా నీట మునిగిన వరి పొలాలను మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ సోమవారం పరిశీలించారు. ఈ మేరకు చిన బోగిలిలో నీటమునిగిన వరిచేను మడులను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ కురుస్తున్న వర్షాలకు, మడులలో చేరిన వర్షం నీరు మళ్లించడానికి సౌకర్యం లేక, కల్వర్టులు శిథిలమైన ప్రాంతాల మడులలో నీరు నిల్వ ఉండిపోవడంతో చేను నీట మునిగిందన్నారు. గ్రామాల్లో పంట నీటమునిగినట్లు రైతులనుంచి వచ్చిన సమాచారం మేరకు వరిచేను పొలాలను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు ఉన్నారు.

చెరువులను తలపిస్తున్న రోడ్లు



చినబొండపల్లి వద్ద రోడ్డు దుస్థితి



పార్వతీపురం గోరీల జంక్షన్ వద్ద రహదారి పరిస్థితి

పార్వతీపురం రూరల్:

వర్షాలు పడితే రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. రోడ్లపై ఏర్పడిన గుంతలు భారీ పరిమాణంలో విస్తరించి వర్షపునీరు నిండి చిన్న నీటికుంటల్లా మారి వాహన చోదకులకు ప్రమాదాలకు గురిచేస్తున్నాయి. పార్వతీపురం నుంచి కొరాపుట్ వెళ్లేందుకు ఉన్న రహదారిలో ఆదమరిస్తే వాహన చోదకుడు ప్రమాదానికి గురికాక తప్పదన్న పరిస్థితి నెలకొంది. రెప్పపాటులో అదుపుతప్పి పడిపోయేందుకు ఆస్కారం ఉన్నట్లు రాళ్లు తేలిన గుంతలు రోడ్డంతా ఉన్నాయి.

బింగుడు వలస రోడ్డుకు కోత



కోతకు గురైన బింగుడు వలస రోడ్డు

సాలూరు రూరల్: మండలంలోని దిగువ మెండంగి నుంచి బింగుడువలస గ్రామానికి నిర్మాణం జరుగుతున్న రోడ్డు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పూర్తిగా కోతకు గురైంది. రోడ్డు పనులు ప్రారంభమై ఏడాది కావస్తున్నా పూర్తికాలేదు. దీంతో రోడ్డు పనుల్లోని నాణ్యతా లోపం, వర్షాలకు రోడ్డు కోతకు గురవుతోందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

దారుణంగా మారిన బైపాస్



చెరువును తలపిస్తున్న రహదారిపై ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు

పార్వతీపురంటౌన్: పట్టణ బైపాస్ రహదారి చెరువును తలపిస్తోంది. పార్వతీపురం- రాయగడ, పార్వతీపురం-పాలకొండకు వెళ్లే భారీ వాహనాలు ఈ రహదారిపైనే ప్రయాణించాల్సి ఉంది. రోడ్డు మరమ్మతులు చేసి రెండు నెలలైనా పూర్తి కాలేదు.. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మళ్లీ మరమ్మతుల బారిన పడడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



రహదారిపై వర్షపు నీరు



కొత్తబూర్జలో చెరువును తలపించే బీటీరోడ్డుపై నీరు



పాతబూర్జలో చెరువును తలపించే విధంగా బీటీ రోడ్డు

గోతులమయమైన బీటీ రోడ్లు

- పట్టించుకోని పాలకులు

సీతానగరం: మండలంలోని, రాష్ట్ర, జాతీయరహదారుల అభివృద్ధి చేపట్టక పోవడంతో గోతులమయమైన రోడ్లపై రాకపోకలు చేయడానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. సీతానగరం-అజ్జాడ బీటీ రోడ్డు, సీతానగరం అప్పయ్యపేట, సీతానగరం-చినభోగిలి గ్రామాల మధ్య బీటీ రోడ్లు గోతులు వారడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నిరంతరం వాహనాలు తిరుగాడే రోడ్లకు అభివృద్ధి పనులు చేపట్టక పోవడంతో పాటు వర్షాలు కురవడంతో ప్రయాణికులు రాక పోకలకు అవస్థలు పడుతున్నారు. అలాగే ఆంధ్రా ఒడిశా ఎగువ ప్రాంతాలకు వర్షాలు కురవడం వల్ల కొత్తవలస డ్యామ్‌మీదుగా నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రమాదకర రోడ్లపై తిరుగాడుతున్న వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న చిన్నారాయుడు పేట జంక్షన్ నుంచి కొత్తవలస బీటీ రోడ్లు చెరువులను తలపించే విధంగా తయారయ్యాయి.



రేపటివలస రహదారిలో ఏర్పడిన గొయ్యి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి

పార్వతీపురం టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేస్తూ వచ్చారని వాటివల్ల కార్మిక వర్గానికి తీవ్రమైన అన్యాయం జరుగుతుందని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి అన్నారు. ఈ మేరకు సోమవారం ఏపీ ఆశ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ మహాసభలు పార్వతీపురంలోని ఎన్జీ హోమ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాడి గ్రాట్యుటీ, మెటర్నిటీ లీవు, 62 సంవత్సరాలకు రిటైర్మెంట్ పెంపు జీఓ నంబర్ 94ను సాధించుకున్నామన్నారు. ఆశ కార్యకర్తల పోరాటాలతో 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంపు, ఏడాదికి రూ. 5 వేలు చొప్పున గరిష్ఠంగా రూ. 1,50,000 గ్రాట్యుటీ పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ 94ను విడుదల చేసిందన్నారు. రాబోయే రోజుల్లో కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సమస్యల కోసం అవసరమైతే సమ్మె చేయడానికి సిద్ధం కావాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించకపోతే జిల్లాలో ఉన్న మంత్రి ఇంటిని ముట్టడిస్తామని ఆమె హెచ్చరించారు. ఈ మహాసభలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ రాష్ట్ర నాయకురాలు ఉమామహేశ్వరి జిల్లా కార్యదర్శి గంట జ్యోతి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె. గంగు నాయుడు సందేశం ఇచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు అధ్యక్షురాలిగా కె.గౌరి, ప్రధాన కార్యదర్శిగా శివాని, కోశాధికారిగా బృంద, వి.ఇందిర, మిగతా పదిమంది ఆఫీస్ బేరర్స్ 25 మంది జిల్లా కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా మహాసభ ఎన్నుకుంది. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, రాము, ఎన్వై నాయుడు, బీవీ రమణ, గొర్లి వెంకటరమణ, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయ నివారణకు చర్యలు



మాట్లాడుతున్న ఏపీఈపీ డీసీఎల్ ఏఈ శశిభూషణరావు

సీతానగరం: ఈదురుగాలులతో కూడిన వర్షాల కారణంగా ఏర్పడిన విద్యుత్ అంతరాయాన్ని నివారించడానికి సిబ్బందిని అప్రమత్తం చేసి వినియోగ దారులకు నాణ్యమైన విద్యుత్‌సరఫరాకు సత్వరచర్యలు తీసుకున్నామని ఏపీ ఈపీడీసీఎల్ మండల ఏఈ శశిభూషణరావు అన్నారు. ఈ మేరకు అప్పయ్యపేట సబ్‌స్టేషన్ వద్ద జరుగుతున్న మరమ్మతులపై సిబ్బందికి సోమవారం ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో విద్యుత్ ఎల్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పొంగిన సువర్ణ ముఖి

- నిలిచిన గిరిజన గ్రామాల రాకపోకలు

సాలూరు రూరల్: మండలంలోని దండిగాం గ్రామం వద్ద సువర్ణముఖి నది పొంగడంతో కురుకూటి, దళాయివలస తదితర గ్రామాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలకు ఏజెన్సీ ప్రాంతంలోని వాగులు పొంగుతుండడంతో గిరిజనులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బ్రిడ్జి నిర్మాణ నిధులు వెనక్కి మళ్లించిన కూటమి ప్రభుత్వం

గత ప్రభుత్వంలో దండిగాం బ్రిడ్జి నిర్మాణానికి రూ.9 కోట్లు మంజూరు కాగా అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం నిధులు వెనక్కి మళ్లించి నిర్మాణ పనులు రద్దు చేయించింది. కూటమికి ఓట్లు వేయలేదని అక్కసుతో దండిగాం బ్రిడ్జి, నేరెళ్లవలస రోడ్డు పనులు చేయకపోవడానికి కారణం కూటమి ప్రభుత్వానికి దండిగాం, నేరెళ్లవలస, కురుకూటి, సారిక పంచాయతీల గిరిజనులు వైఎస్సార్‌సీపీ అభిమానులు కావడంతో ఈ ప్రాంత అభివృద్ధి విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకు నిదర్శనంగా ఇటీవల కురుకూటి గ్రామంలో మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీలను గెలిపించి తీసుకు వస్తే మీరు అడిగినవన్నీ చేస్తానని అనడమే ఒక ఉదాహరణగా చెప్పవచ్చు.



దండిగాం వద్ద గెడ్డ పొంగడంతో నిలిచిన వాహనాల రాకపోకలు

200 బస్తాల డీఏపీ ఏమైనట్లు?

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని మొండెంఖల్లు గ్రామ రైతు సేవా కేంద్రానికి శుక్రవారం వచ్చిన 200 బస్తాల డీఏపీ ఏమైనట్లు అని సర్పంచ్ ఇంటికుప్పల గౌరీశంకరరావు ప్రశ్నించారు. డీఏపీ బస్తా కోసం రైతు సేవా కేంద్రానికి సోమవారం వెళ్లిన ఆయనకు అక్కడి సిబ్బంది ఒక్క బస్తా కూడా లేదని చెప్పడం ఆయనను ఆశ్చర్యానికి గురిచేసింది. శుక్రవారం ఎరువుల బస్తాలు కేంద్రానికి రాగా శుక్ర, శని, ఆదివారాలు వరుసగా సెలవులు కావడంతో ఆ బస్తాలు ఏమయ్యాయని, ఎవరికి ఇచ్చారని నిలదీశారు. ఇదే విషయమై వీఏఏని అడగ్గా ఇటీవల బదిలీ అయిన వ్యవసాయ సహాయకురాలి లాగిన్‌లోనే ఆ ఎరువుల బస్తాలు ఉన్నాయని, ఏమైందో ఆమెకే తెలియాలని సమాధానం ఇచ్చారు. అయినా దీనిపై స్పష్టతనివ్వాలని, ఉన్నతాధికారులు స్పందించి, ఎరువుల బస్తాల మాయం వెనక రహస్యాన్ని బహిర్గతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎంఈఓ-1లకు సెల్ఫ్‌డ్రాయింగ్ అధికారం కల్పించండి

- అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల

పార్వతీపురం రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖలో పనిచేస్తున్న ఎంఈఓ-1లకు సెల్ఫ్ డ్రాయింగ్ అధికారాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ సెక్రటరీ కోన శశిధరకు లేఖద్వారా ప్రాతినిధ్యం చేసినట్లు ఎంఈఓ-1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెల్ఫ్ డ్రాయింగ్ అధికారం లేనందున చాలా ఇబ్బందులు పడుతున్నామని ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని లేఖలో పేర్కొన్నట్లు స్పష్టం చేశారు.

వర్షాలకు సెలవిచ్చే అధికారం ఇవ్వాలి

- పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అమరాపు

పార్వతీపురం రూరల్: వర్షాల వల్ల సెలవిచ్చే అధికారం ఎంఈఓలకు, ప్రధానోపాధ్యాయులకే ఇవ్వాలని, వర్షాలకారణంగా సోమవారం పాఠశాలలకు సెలవు ప్రకటించడం ఒకింత ఆశ్చర్యానికి గురిచేసిందని పీఆర్‌టీయూ అసోసియేట్ అధ్యక్షుడు అమరాపు సూర్యనారాయణ అన్నారు. వాతావరణ శాఖ ఇచ్చే సూచనలను బట్టి కలెక్టర్ సెలవు ప్రకటించారు కానీ సోమవారం ఎండకాసిందని, అనవసరంగా సెలవు ప్రకటించారన్నారు. ఇకముందు సెలవు ఇచ్చే పరిస్థితి వస్తే ఆ అధికారం మండల విద్యాశాఖాధికారికి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఇవ్వాలని కోరారు.

ఖైదీల ఆరోగ్యం పట్ల దృష్టి సారించాలి

- న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు



సబ్ జైలులో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా న్యాసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు

పాలకొండ రూరల్: సబ్‌జైల్‌లో ఉన్న ఖైదీల ఆరోగ్యం పట్ల దృష్టి సారించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. డివిజన్ కేంద్రంలోని సబ్‌జైల్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఖైదీలతో మాట్లాడుతూ.. ఆరోగ్య పరీక్షలు చేయడానికి వైద్యులు వస్తున్నారా.. లేదా.. ఎటువంటి ఆహారం అందిస్తున్నారు.. తదితర వివరాలపై ఆరా తీశారు. అలాగే జైలు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఖైదీలకు తాగేందుకు వేడినీరు ఇవ్వాలని జైలు సూపరింటెండెంట్ బి.జోగులును ఆదేశించారు. ఈయన వెంట హెడ్ వార్డర్ జి.రమణయ్య, తదితరులున్నారు.

పోడు పట్టాల కోసం గిరిజనుల ఎదురుచూపులు



నాగలితో పోడు దున్నుతున్న గిరిజన రైతు

సాలూరు రూరల్: గిరిజనులకు పోడుపట్టాలు ఇస్తామని గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఇచ్చిన హామీతో ఆగస్టు 15న తమకు పట్టాలు వస్తాయని ఎదురు చూసిన గిరిజనుల ఆశ నిరాశ అయిందనే చెప్పవచ్చు. సాలూరు మండలంలో ఎక్కువ శాతం గిరిజనులు పోడు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. గత ప్రభుత్వంలో జగనన్న గిరిజనులకు పోడుపట్టాలు ఇవ్వడంతో పాటు వాటికి రైతుభరోసా వచ్చేవిధంగా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆగస్టు 15 కల్లా గిరిజనులకు పోడు పట్టాలు ఇస్తామని హామీఇచ్చి పట్టాలు ఇవ్వకపోవడంతో గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పట్టాలు ఇస్తుందని ఎంతో ఆశగా ఎదురు చూశామని వాపోతున్నారు.

హైకోర్టునే తప్పుదోవ పట్టించిన ప్రభుత్వం



మాట్లాడుతున్న నాయకులు

సాలూరు: కూటమి ప్రభుత్వం హైకోర్టునే తప్పుదోవ పట్టించిందని ఆదివాసీ వికాస్ పరిషత్ ప్రతినిధి చెల్లూరి జోగయ్య ఆరోపించారు. గిరిజన ఉద్యోగుల న్యాయ సలహాదారు రేగు మహేశ్వరరావుతో కలిసి సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇటీవల రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ గిరిజనసంక్షేమశాఖ ఈఎన్‌సీ శ్రీనివాసరావు ఏసీబీకి చిక్కారని అన్నారు. గతంలోను అవినీతి ఆరోపణలు ఉన్న ఈఎన్‌సీ శ్రీనివాసరావుకు సంబంధించి విశాఖపట్నానికి చెందిన ద్విభాషిశేషగిరిరావు అనే వ్యక్తి 2024 హైకోర్టులో కేసు వేయగా డిసెంబర్‌లో విచారణకు వచ్చిందన్నారు.అయితే సదరు ఈఎన్‌సీపై విజిలెన్స్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారని కావున కోర్టు జోక్యం అవసరం లేదని, కేసును క్లోజ్ చేయాలని ప్రభుత్వం కోరడంతో కోర్టు శేషగిరిరావు వేసిన ప్రజావ్యాజ్యాన్ని డిస్మిస్ చేస్తూ, ఇప్పటికే సదరు ఈఎన్‌సీపై విజిలెన్స్ దర్యాప్తు జరుగుతున్నందున ప్రత్యేక కేసు అవసరం లేదని దీనికి ప్రత్యేక డైరెక్షన్ అవసరం లేదంటూ కేసును కొట్టేశారన్నారు. కూటమి ప్రభుత్వ పెద్దలు ఈ విధంగా కోర్టును తప్పుదోవ పట్టించారని ఆరోపించారు.

గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ తెర్లి జగన్‌మోహనరావు

సీతానగరం: జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ప్రజలు, వైద్యాధికార సిబ్బంది ముందు జాగ్రత్తచర్యలు తీసుకోవాలని ఎన్‌సీడీ డాక్టర్ టి.జగన్‌మోహనరావు అన్నారు. తనపర్యటనలో భాగంగా సోమవారం బూర్జలో వైద్యాధికార సిబ్బంది, పంచాయతీ సర్పంచ్ జి.దాసు ఆధ్వర్యంలో వీధుల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో వర్షాలు కురుస్తున్న కారణంగా సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి సేవలందించడానికి కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ గాయత్రి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయోత్పత్తులతో ఆరోగ్యం



కూరగాయల విక్రయాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో త్రివిక్రమరావు

గుమ్మలక్ష్మీపురం: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను తినడం ద్వారా మంచి ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో పి.త్రివిక్రమరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ సోమవారం ప్రారంభించి, ప్రకృతి సేద్యం ద్వారా పండించిన ఆకుకూరలు, కూరగాయలను విక్రయించారు. అనంతరం ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణానికి ప్రకృతి వ్యవసాయం అవసరాన్ని క్షుణ్ణంగా వివరించారు. రైతులంతా ప్రకృతి సేద్యం వైపు మరలాలని, ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలకు మంచి డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం క్లస్టర్ కో-ఆర్డినేటర్ కిమిడి భూషణరావు పాల్గొన్నారు.

వసతిగృహాన్ని పునఃప్రారంభించాలి



విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐ వసతిగృహాన్ని పునఃప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎ.గంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐటీఐ వసతిగృహ విద్యార్థులతో సోమవారం ఆందోళన చేపట్టారు. విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడే వసతిగృహాన్ని కొన్నేళ్లుగా నిర్వహించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం హాస్టల్‌ను నిర్వహించని కారణంగా విద్యార్థులే వంటలు వండుకుని, చదువుకోవాల్సి వస్తోందని ఇలా అయితే పరీక్షల సమయంలో చాలా ఇబ్బంది కాదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తక్షణమే హాస్టల్‌ను పునఃప్రారంభించి విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, ముఖ్యంగా మూడు పూటలా నాణ్యమైన ఆహారం, సౌకర్యవంతమైన వసతి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.